క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన స్తంభంపల్లి గ్రామస్తులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిశారు. గ్రామంలో గౌడ సంఘం భవనం మిగులు పనులకు రూ.ఐదు లక్షలు నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, అక్కెనపెల్లి కరుణాకర్, గౌడ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసారపు మల్లేశం, పులి అంజయ్య, పులి నారాయణ ఉన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

వీర్నపల్లి: మండలంలోని కస్తూర్బా పాఠశాలకు వెళ్లే దారిలో, అడవిపదిర గ్రామం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు పనులు చేపట్టలేదని, అందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. వాహనాలు ఊరిలోకి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు, వికలాంగులు రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందన్నారు. కస్తూర్బా పాఠశాలకు వెళ్లే దారిలో వంతెన నిర్మాణం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. క్రాంతి, మనోభి షేక్, విష్ణు, రాబిన్సన్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక పథకం కంటివెలుగు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. శుక్రవారం మండలంలోని పద్మనగర్ గ్రామపంచాయతీ పరిధిలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ ముడారి పోచయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, సింగిల్ విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ స్నేహ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు మోర నిర్మల, జాగృతి అధ్యక్షుడు రామాగౌడ్, వార్డు సభ్యులు భాగ్యలక్ష్మీ, పవన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోర్డులకే పరిమితం

- ఎక్కడపడితే అక్కడ బోర్డులు ఏర్పాటు
- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- లక్షల రూపాయలు వృథా
- అందుబాటులో లేని క్రీడా పరికరాలు



ఈ ఫొటో వేములవాడ రూరల్ మండలంలోని అచ్చన్నపల్లి గ్రామ శివారులో క్రీడా ప్రాంగణం కోసం ఏర్పాటు చేసిన బోర్డు కానీ ఇక్కడ ఎలాంటి క్రీడా పరికరాలు లేకుండా రైతులు ఉపయోగించుకునే పనిముట్లు మాత్రం ఉంటాయి.





ఈ ఫొటో వేములవాడ మండలంలోని మల్లారం గ్రామంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం మూలవాగును ఆనుకుని ఉన్న ఈ స్థలానికి క్రీడా ప్రాంగణంగా బోర్డు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. కానీ ఈ ప్రాంతమంతా మూలవాగు పరిధిలోదే కావడం గమనార్హం.



ఈ ఫొటోలో బాలరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలకే క్రీడాప్రాంగణం బోర్డును ఏర్పాటు చేశారు. విద్యను అభ్యసించే పాఠశాలకే బోర్డును తగిలించి క్రీడాప్రాంగణంగా రికార్డులో రాసుకున్నారు.

వేములవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. లక్షల రూపాయలతో గ్రామానికి అనువైన స్థలంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు, క్రీడాకారులకు ఉపయోగం ఉంటాయని సంకల్పించింది. కాని వేములవాడ రూరల్ మండలంలో అధికారులు క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు ఎక్కడపడితే అక్కడ బోర్డులు ఏర్పాటు చేసి పని అయ్యిందనిపించారు. వాటివల్ల ఒకవైపు ప్రభుత్వ ధనం వృథా కావడమే కాకుండా, క్రీడాకారులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో ఇప్పటి వరకు దాదాపు 12 గ్రామాల్లో పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో కూడా పనులు జరుగుతున్నాయని, అవి కూడా త్వరలోనే పూర్తవుతాయంటున్నారు. కానీ ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు కొన్ని గ్రామాల్లో అందుబాటులో ఉన్నప్పటికీ చాలా గ్రామాల్లో నిరుపయోగంగానే ఉన్నాయి. చాలా గ్రామాల్లో ఊరుకు దూరంగా ఏర్పాటు చేయడంతో వాటిని వినియోగించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డు మాత్రమే ఏర్పాటు చేసి క్రీడా పరికరాలను ఏర్పాటు చేయకపోవడంతో అవి కూడా వృథాగానే ఉంటున్నాయి. వీటిని గ్రామ సర్పంచులకు ఈజీఎస్ పనుల ద్వారా నిర్మించిన వీటికి ఇప్పటి వరకు బిల్లులు రాక సర్పంచులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో నిర్మాణానికి ఎవరు కూడా ముందుకు రాకపోవడంతో తప్పని పరిస్థితుల్లో అధికారుల ఒత్తిడి వల్ల క్రీడా ప్రాంగణాల బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. లక్షల రూపాయలు మంజూరు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని అంటున్నారు.

స్థలాలు లేక..

క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు గ్రామాల్లో స్థలాలు అందుబాటులో లేవు. చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి ఉండడంతో దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మల్లారం గ్రామంలో అనువైన స్థలం లేకపోవడం వల్ల మూలవాగులోనే క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఎలాంటి ఉపయోగం లేని ఈ స్థలంలో లక్షల రూపాయలతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం ఏమిటని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, జిల్లా అధికారులు క్రీడా స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనువైన స్థలంలోనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు వృథా



గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా మైదానాల వల్ల యువతకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. లక్షల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న ఈ క్రీడా మైదానాలు నిరుపయోగంగానే ఉన్నాయి. అనువైన స్థలాల్లో ఏర్పాటు చేయకపోవడంతో యువకులు వీటిని ఉపయోగించుకోవడం లేదు.

– రంగు వెంకటేశ్, ఎంపీటీసీ, వట్టెంల

పరికరాలు లేవు



గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు పేరుకు మాత్రమే ఉన్నాయి. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. వాటిలో క్రీడా పరికరాలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచాలి.

– పాలకుర్తి సుమంత్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, నూకలమర్రి

ఉపయోగకరంగా ఉండాలి



గ్రామాల్లో నిర్మించే క్రీడా ప్రాంగణాలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మంచి ఆలోచనతో గ్రామాల్లో నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణాలు చాలా గ్రామాల్లో నిరుపయోగంగానే ఉన్నాయి. యువతకు అనువుగా లేకపోవడంతో వీటిని ఉపయోగించుకోవడం లేదు.

– ఎడపెల్లి అనిల్, చెక్కపల్లి

స్థలం కొరత ఉంది



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాల కొరత ఉంది. రెవెన్యూ శాఖ అధికారులు చూపిన స్థలంలోనే ఏర్పాటు చేస్తున్నాం. మిగతా గ్రామాల్లో కూడా త్వరలోనే ఏర్పాటు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

– రాంరెడ్డి, ఎంపీడీవో, వేములవాడరూరల్

నియామకం

బీజేపీ చేనేత సెల్ కన్వీనర్‌గా తడుక విజయ్



సిరిసిల్లటౌన్: బీజేపీ చేనేత సెల్ కన్వీనర్‌గా తడుక విజయ్ నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బర్కం లక్ష్మీయాదవ్కు కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణ మార్పులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సిరిసిల్లకల్చరల్: వాతావరణంలో వస్తున్న విపరీత పరిణామాలపై సర్దాపూర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. చంద్రంపేటలోని రైతు వేదికలో జరిగిన అవగాహన కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం పి. మనోహర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఉమ, జిల్లా వ్యవసాయాధికారి రణధీర్, ఉద్యానశాఖ అధికారిణి జ్యోతి మాట్లాడారు. పంట మార్పిడి విధానాలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు గురించి వివరించారు. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు అవసరమైన సూచనలు చేశారు. జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావుతో పాటు రైతులు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీడు భూములు సస్యశ్యామలం



గోదావరి నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ శరత్

ముస్తాబాద్: స్థానిక పెద్ద చెరువుకు చేరిన మల్లన్న సాగర్ గోదావరి జలాలను ఎంపీపీ జనగామ శరత్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలు ఇన్ని రోజులు నీళ్లు లేక ఆగం అయ్యారన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని పంపించారన్నారు. ఈ కెనాల్ ద్వారా ముస్తాబాద్ మండలంలోని 8 చెరువులను నీటితో నింపడం జరుగుతుందన్నారు. దీంతో యాసంగి పంటలకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. భూగర్భ జలాలు పెరిగి తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణాధ్యక్షులు సురేందర్‌రావు, నర్సింహారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సాహం





సిరిసిల్లటౌన్/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయంపై ఆ పార్టీ నేతలు సంబరాలు జరిపారు. శుక్రవారం సిరిసిల్ల గాంధీ చౌక్‌లో, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేటలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈ గెలుపు రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి నాంది అని నాయకులు అన్నారు. పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సింగరవేణి కృష్ణహరి నాయకులు పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదకర బావి- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: రోడ్లకు ఇరువైపులా ప్రమాదకర బావులను పూడ్చివేయాలని జిల్లా అధికారులు ఆదేశించినా పట్టించుకున్నవారు లేరు. వేములవాడ నుంచి జగిత్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డు వట్టెంల ప్రభుత్వ పాఠశాల దగ్గర ప్రధాన రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి ఉంది. అక్కడే పాఠశాల ఉండడంతో పిల్లలు నిత్యం ఆటలు ఆడుకుంటారు. ఈ విషయంపై చాలాసార్లు అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి బావులను గుర్తించి పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



ప్రొసీడింగ్స్ కాపీలు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివృద్ధి సాధించాలని తహసీల్దార్ జయంత్‌కుమార్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండపురం బాల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మహిళ సంఘాలకు పావల వడ్డీ మాఫీ ప్రొసీడింగ్స్ కాపీలను 88 మందికి రూ.2.62 లక్షల వాటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీటీసీ గీతాంజలి, సీసీ సుధాకర్, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ కాంగ్రెస్, ఏబీవీపీ ఆందోళనలు



ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..


సిరిసిల్లటౌన్: ఏబీవీపీ కార్యకర్తలు తలపెట్టిన సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో రాష్ట్ర సర్కారు మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపిస్తూ ఏబీవీపీ కార్యకర్తలు శుక్రవారం సిరిసిల్ల కొత్త బస్టాండ్‌వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు లాక్కోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనితరామచంద్రన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో వరుసగా ఫుడ్‌పాయిజన్ కేసులు పెరిగిపోవడం ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడమే కారణమన్నారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెన నాగరాజు, మారవేని రంజిత్‌కుమార్, లోపెలిల రాజు, రాము, దిలీప్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



బోయినపల్లి: బోయినపల్లి హైస్కూల్, కేజీబీవీ, ఆనంద్ విద్యానికేతన్ హైస్కూళ్లలో శుక్రవారం 181 పోస్టర్ ఆవిష్కరించారు. సఖీ సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జెండర్ వివక్షత, ప్రేమ ఆకర్షణ తేడాలు, పోక్సో చట్టం, మొబైల్ వాడకంతో నష్టాలు, ఫొటో ఇమేజెస్ షేరింగ్, సైబర్ క్రైమ్స్ గూర్చి అవగాహన కల్పించారు. సఖీ సెంటర్ కౌన్సిలర్ కళావతి, పారా మెడికల్ ప్రవళిక, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సెలర్ రేణుక, సభ్యుడు శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం ప్రేమలత, కేజీబీవీ ఎస్‌వో పద్మ, కరస్పాండెంట్ ఆనందం, ప్రిన్సిపాల్ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న మనోహర్‌రెడ్డి అభిమానులు

వేములవాడఅర్బన్: వేములవాడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు, కౌన్సిలర్లు నరాల శేఖర్, నీలం శేఖర్, పులి రవి, రాము, వెంగళ శ్రీనివాస్, యామ తిరుపతి పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూళ్లకు గౌరవం



కౌన్సిలర్లను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: నూరు శాతం మున్సిపల్ పన్నులు వసూళ్లు చేసిన వార్డుల కౌన్సిలర్లకు పాలకవర్గం గౌరవం అందించింది. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో 1, 14, 20, 32 వార్డుల్లో వందశాతం ఇంటిపన్నులు వసూళ్లు కావడంపై హర్షం ప్రకటించింది. ఈమేరకు ఆయా వార్డుల కౌన్సిలర్లు పోచవేని సత్య, అడ్డగట్ల మాధవి, ఆడెపు సౌజన్య, సీమాబేగంలను చైర్‌పర్సన్ జిందం కళ నేతృత్వంలో సన్మానించారు. త్వరలోనే అన్ని వార్డులు నూరు శాతం పన్నులు వసూళ్లవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెల్దండి సమ్మయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట ఎస్సైగా రాజేశ్



ఇల్లంతకుంట: ఇల్లంతకుంట నూతన ఎస్సైగా రాజేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మామిడి మహేందర్ బదిలీపై వెళ్లారు.

పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో శ్రీపెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దపట్నంతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ న ర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సరిత, ఉ పసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు ఆర్థికసాయం

చందుర్తి: చిన్న పిల్లలను పోషించే స్తోమత లేక ఆర్థిక ఇబ్బంది పడుతున్న చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన గుడిపెల్లి రజిత అనే నిరుపేద మహిళకు మూడపల్లి గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముస్తాబాద్: ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టినందుకు ప్రధాని మోదీ చిత్రపటానికి మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ పథకంతో లక్షలాది పేద కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పలువురికి ఆయుష్మాన్ భారత్ సర్టిఫికెట్లను అందజేశారు. నాయకులు ప్రణీత్, రాజు, నందం, అంజిరెడ్డి, మాధవరెడ్డి, అజయ్, వంశీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చందుర్తి: నిరుపేద కుటుంబానికి చెందిన చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన దర్శనాల సత్తవ్వ అనే క్యాన్సర్ బాధితురాలికి ఎన్నారైలు వరిగోపాల్, పొక్కిలి బాబు, మ్యాకల నాగరాజు కలిసి రూ.20 వేలను పంపించగా శుక్రవారం రాత్రి బాధితురాలికి అందజేశారు. సర్పంచ్ న్యాత విజయ జార్జ్, ఉపసర్పంచ్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ప్రముఖులు కటకం చంద్రయ్య, మ్యాకల నర్సయ్య, పొక్కిలి ప్రవీణ్, దర్శనాల సుమన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌పీ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో



సిరిసిల్లటౌన్: రాస్తారోకో చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్/బోయినపల్లి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అరెస్టు నిరసిస్తూ ఆ పార్టీ నేతలు శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలన పూర్తిగా అవినీతి మయమైందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారం చేపడుతారని, నిరుద్యోగులకు అండగా తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, యారావు రాజబాబు, లింగంపల్లి మధుకర్, మహేందర్, ప్రవీణ్, బోయినపల్లిలో నిర్వహించిన రాస్తారోకోలో నియోజకవర్గ అధ్యక్షుడు మాంకాళి తిరుపతి, మండల అధ్యక్షుడు అలువాల అజయ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.